మారో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

# అధికారం శాశ్వతం కాదు

■ **మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజం**



**పల్నాడు:** అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు. నరసరావుపేటలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికార బలాన్ని ఉపయోగించి వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఓటమి భయంతోనే అక్రమ అరెస్టులు, బైండోవర్లు, తప్పుడు కేసులతో అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించి, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దాచేపల్లిలో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిపై తప్పుడు కేసు బనాయించారని, గురజాలలో నామినేషన్ దాఖలు చేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నామినేషన్ డిపాజిట్ చెల్లింపునకు సంబంధించిన రసీదు ఇచ్చిన తర్వాత కూడా స్క్రూటినీలో నామినేషన్‌ను తిరస్కరించడం అన్యాయమని విమర్శించారు. స్థానిక ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించే ఉద్దేశం లేకపోతే చట్టాలను మార్చుకుని అధికార పార్టీ నేతలే పదవుల్లోకి వచ్చేలా రాసుకోవాలని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధంగా పనిచేయాల్సిన పోలీసులు, ఎన్నికల అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల అక్రమాలు, తప్పుడు కేసులపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. గురజాల నియోజకవర్గంలో ఏకగ్రీవాల పేరుతో ప్రజల హక్కులను కాలరాస్తున్నారని, ఈ విధానం టీడీపీకి రాజకీయంగా నష్టాన్ని కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యాన్ని అణచివేసే విష సంస్కృతి చివరకు దానిని ప్రోత్సహించిన వారికే శాపంగా మారుతుందని కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు.